# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 134 | పేజీలు : 08 | శుక్రవారం | 22-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## అప్పగించలేదు
# అరెస్ట్ చేశారు



- భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు: సీఎం రేవంత్ రెడ్డి
- అప్పా జంక్షన్ తనిఖీల్లో బండి భగీరథ్ అరెస్ట్
- లొంగిపోయారనే ప్రచారాన్ని ఖండించిన రేవంత్
- పోలీసుల దర్యాప్తు సమాచారానికే ముఖ్యమంత్రి మద్దతు
- మైనర్ బాలిక అంశంపై రాజకీయాలను తప్పుబట్టిన సీఎం
- కేటీఆర్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు.

**అది సరెండర్ ఎలా అవుతుంది?**

బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసులను ఇంటికి

# ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

**రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..**

- రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ.. ఎన్నాళ్లీ మొద్ద నిద్ర అని ప్రశ్న!
- పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ రేవంత్ కు కేటీఆర్ లేఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్
- 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన
- గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు
- రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కోసం
# ఇన్‌ఛార్జిల నియామకం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్




బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల



## రాజకీయం చేస్తే
# సహించం

- మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయం చేస్తే సహించం: రేవంత్ రెడ్డి
- రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన రేవంత్ రెడ్డి
- స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికింది రాజీవ్ అని కితాబు
- సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య



# 48.1 డిగ్రీలు...
## పిడుగురాళ్లలో రాళ్లు పగిలే ఎండ!

- నిప్పుల కొలిమిలా ఏపీ
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా నమోదు
- వచ్చే సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరిక

## మావోయిస్టులకు
# భారీ ఎదురుదెబ్బ..

**ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు**

- ఝార్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు
- లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత
- అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ



## 'మావిగన్'ను ప్రతిపాదించింది
# అందుకే జగన్



- స్కాముల కోసమే చంద్రబాబు అమరావతి అంటున్నారన్న జగన్
- కేసీఆర్ రూ. 615 కోట్లతో అత్యాధునిక సచివాలయాన్ని కట్టారని ప్రశంస
- 'మావిగన్'కు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారని వ్యాఖ్య



## తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన
# సీఎం రేవంత్..

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**నాలుగు కేటగిరీలుగా..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు.

# వెంటనే ప్రారంభం కావాలి

- నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం
- పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు వెంటనే ప్రారంభం కావాలని ఆదేశం
- ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల విలువైన 282 ప్రాజెక్టులకు ఆమోదం
- ఇప్పటికే 114 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వెల్లడించిన అధికారులు
- అనుమతులు, భూ కేటాయింపులు వేగవంతం చేయాలని సీఎం సూచన



హైదరాబాద్ పల్స్,డెస్క్

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు (ఎంవోయూలు), రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక




## జైలుకు పంపుతారేమో
# అనిపిస్తోంది

- నేను ఢిల్లీకి రాగానే జైలుకు పంపుతారేమో అనిపిస్తోంది: కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు
- దేశంలో సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ పార్టీ
- 5 రోజుల్లోనే ఇన్స్టాలో 1.4 కోట్లకు పైగా ఫాలోయర్లు
- ప్రస్తుతం అమెరికాలో చదువుతున్న కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్

## రేవంత్ అబద్ధం చెప్పారా బండి సంజయ్ అబద్ధం చెప్పారా?

- రేవంత్ అబద్ధం చెప్పారా లేక బండి సంజయ్ అబద్ధం చెప్పారా?: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- తన కొడుకుని తానే పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్
- భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారన్న రేవంత్ రెడ్డి
- ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజమన్న ప్రవీణ్ కుమార్



## అప్పగించలేదు అరెస్ట్ చేశారు

మొదటి పేజీ తరువాయి

పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని నిలదీశారు.

**బాలిక విషయంలో రాజకీయం వద్దు**

ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు.

## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

మొదటి పేజీ తరువాయి

జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు.ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్లు కూడా సమకూర్చలేకపోతోందని, దీనివల్ల రైతులు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతుంటే నిస్సహాయ స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంటలకు బోనస్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం మద్దతు ధరకు కొనుగోళ్లు కూడా చేయలేకపోతే 60 లక్షల మంది రైతులకు ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు, రాస్తారోకో జరగని రహదారి లేదన్న కేటీఆర్... ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు కాంగ్రెస్ సర్కారుకు వాతలు పెడతారని అన్నారు. అన్నదాతల చేతిలోనే ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, లేనిపక్షంలో చరిత్రలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ఒక 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని హెచ్చరికలు చేశారు.

## రేవంత్ అబద్ధం చెప్పారా బండి సంజయ్ అబద్ధం చెప్పారా?

మొదటి పేజీ తరువాయి

పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం ఒక పెద్ద రాజకీయ రచ్చకు దారితీసింది. ఈ అరెస్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అసలు జరిగింది పోలీసు అరెస్ట్ కాదా? లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా? ఏది నిజం? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెబుతున్నారా.. లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా? అని ఆయన నిలదీశారు.అసలేం జరిగిందంటే... ఈరోజు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... “రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి మరీ బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో రాజకీయం లేదు, పోలీసుల మాట నమ్మాలి” అని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా నిన్న బండి సంజయ్ స్పందించారు. “నేనొక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నేనే నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను” అని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో “మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా?” అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కోసం ఇన్‌ఛార్జిల నియామకం

మొదటి పేజీ తరువాయి

ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు.పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

మొదటి పేజీ తరువాయి

సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు, మరో ఆరుగురు ఏరియా కమాండర్లు, 13 మంది చురుకైన హార్డ్‌కోర్ సభ్యులు ఉన్నారు. వీరంతా సుదీర్ఘకాలంగా ఝార్ఖండ్‌లోని అత్యంత క్లిష్టమైన కోలహాన్, దట్టమైన సరంద అటవీ ప్రాంతాలలో తమ సాయుధ కార్యకలాపాలను నిర్వహిస్తూ భద్రతా దళాలకు సవాలుగా మారారు.ఈ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఎల్ఎమ్‌జీ, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్ లు, 303 రైఫిళ్లు, దేశవాళీ తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. 100కు పైగా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉండి, సుదీర్ఘకాలంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న టాప్ కమాండర్ సాగెన్ అంగారియా అలియాస్ డొకోల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంతటి కీలక నేతలు, కేడర్ ఒకేసారి ప్రధాన స్రవంతిలోకి రావడంతో ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లయింది.ఈ సందర్భంగా ఝార్ఖండ్ డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భద్రతా దళాలు సమష్టిగా, వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. హింసను వీడి వచ్చిన వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, సమాజంలో గౌరవప్రదంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇంకా అడవుల్లో అజ్ఞాతంలో కొనసాగుతున్న మిగిలిన మావోయిస్టులు కూడా తక్షణమే హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వాడుకుంటూ ప్రధాన స్రవంతిలోకి రావాలని సీఆర్పీఎఫ్ ఐజీ సాకేత్ సింగ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే

మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైసీపీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఏపీకి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన 'మావిగన్' పేరు ఎత్తితేనే చంద్రబాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, భయంతో మంత్రులతో బూతులు మాట్లాడిస్తున్నారని జగన్ విమర్శించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా... సున్నా నుంచి ప్రారంభించాల్సిన అమరావతి కంటే, ఇప్పటికే అన్ని సదుపాయాలు ఉన్న 'మావిగన్' ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా చూపించామని జగన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు పలికారని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకనే చంద్రబాబు తనపై, వైసీపీపై బురద జల్లుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు.అమరావతిలో కేవలం రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు ఖర్చవుతుందని.. రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తెలిసినా చంద్రబాబు కేవలం స్కామ్‌ల కోసమే ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అమరావతి పేరుతో రూ. 47,387 కోట్లు అప్పు చేశారని, ఖజానా నుంచి మరో రూ. 9,200 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు.అమరావతిలో ఇప్పటికే రూ. 1,200 కోట్లతో నిర్మించిన అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ తాత్కాలిక భవనాలు ఉన్నప్పటికీ, మళ్లీ కొత్తగా కడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనమన్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన 5 బిల్డింగ్‌ల అంచనాలను జగన్ ప్రశ్నించారు. ఈ ఐదు బిల్డింగుల డిజైన్లకే రూ. 401 కోట్లు తగలేశారని, మొత్తం నిర్మాణ ఖర్చు రూ. 10,665 కోట్లుగా చూపించారని లెక్కలు కట్టారు.“ప్రస్తుత అంచనాల ప్రకారం చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ. 20,427 అవుతోంది. దీనికి ఫర్నీచర్, ఇంటీరియర్ ఖర్చులు కూడా కలిపితే చదరపు అడుగుకు రూ. 30 వేలు దాటుతుంది. ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికే చదరపు అడుగుకు రూ. 4,500 లోపు ఖర్చవుతుంటే, ఇక్కడ ఇంత భారీ ఖర్చు దేనికి?” అని జగన్ నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో కేసీఆర్ కేవలం రూ. 615 కోట్లతోనే అత్యంత ఆధునిక సచివాలయాన్ని నిర్మించారని, కానీ ఏపీలో మాత్రం కొత్త టెండర్ల పేరుతో పాత కాంట్రాక్టర్లకే పనులు ఇస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

## వెంటనే ప్రారంభం కావాలి

మొదటి పేజీ తరువాయి

మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని (గ్రౌండింగ్ అయ్యాయని) అధికారులు సమావేశంలో వివరించారు.మిగిలిన ప్రాజెక్టుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. వాటికి అవసరమైన అనుమతులు, భూ కేటాయింపుల ప్రక్రియను వేగవంతం చేసి, అవి కూడా త్వరగా గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజకీయం చేస్తే సహించం

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని, తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లుకు ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఈ దేశంలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితోనే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలన్నారు.భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెలికాం విప్లవాన్ని పరిచయం చేసి ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని రేవంత్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతానికి, గాంధీ కుటుంబానికి మధ్య దశాబ్దాల కాలంగా ఒక అవినాభావ సంబంధం ఉందని, అది కేవలం రాజకీయ బంధం మాత్రమే కాదని.. కుటుంబ సంబంధాల కంటే ఎంతో పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు.కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి, సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేతమైన చారిత్రాత్మక నిర్ణయంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గడ్డపై తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఇక్కడి ప్రజలు గాంధీ కుటుంబం చేసిన త్యాగాన్ని, సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ప్రజా ప్రభుత్వం పూర్తిగా రాజీవ్ గాంధీ ఆశయాలు, స్ఫూర్తితోనే ప్రజాక్షేమం కోసం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## జైలుకు పంపుతారేమో అనిపిస్తోంది

మొదటి పేజీ తరువాయి

మన దేశంలో సునామీ సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన వ్యాఖ్యలు చేశారు. “నేను అమెరికా నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టగానే, పోలీసులు నన్ను నేరుగా తిహార్ జైలుకు తీసుకెళతారనిపిస్తోంది” అని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పుట్టిన ఈ వ్యంగ్య డిజిటల్ ఉద్యమం... కేవలం 5 రోజుల్లోనే 1.4 కోట్లకు పైగా ఇన్స్టాగ్రామ్ ఫాలోయర్లతో బీజేపీ, కాంగ్రెస్ అకౌంట్లను దాటేసింది.గూగుల్ ఫామ్ ద్వారా ప్రారంభమైన ఈ పార్టీలో మహువా మొయిత్రా, మనీష్ సిసోడియా వంటి ప్రతిపక్ష నేతలు కూడా చేరారు. అయితే, లీగల్ డిమాండ్ల కారణంగా ఈ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనిపై అభిజీత్ స్పందిస్తూ.. “ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని నేనేమీ సంతోషంగా లేను. ఫాలోవర్లు పెరిగినంత మాత్రాన యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేపర్ లీకేజీలు వంటి అసలు సమస్యలు మారిపోవు కదా” అని విశ్లేషించారు. ఏది ఏమైనా కోట్ల ఫండింగ్ లేకుండా కేవలం మీమ్స్‌తో ఈ పార్టీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను షేక్ చేస్తోంది.

## 48.1 డిగ్రీలు...

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో వేసవి తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపిస్తోంది. రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తుండగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిడుగురాళ్లలో నిన్న 47.6 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఇవాళ మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.ఇక ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి.గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వచ్చే సోమవారం వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

## తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్..

మొదటి పేజీ తరువాయి

కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనం నిర్ణయించాం. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుంది.

**ఐటీ, అమెరికా ఆలోచనలు వద్దు..**

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలి.

## ఉపాధి హామీ పనులకు హాజరయ్యే
# కార్మికుల సంఖ్యను పెంచాలి

**పనిస్థలాల్లో ఉపాధి హామీ కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఏం ఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో కార్మికులకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పని సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాస్టర్ కార్డు లు పరిశీలించి ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు వస్తున్నారు, పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి కార్మికుడి హాజరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సర్పంచ్ కంగాల అంజలి డిఆర్డిఓ విద్యాచందన, తాసిల్దార్ శిరీష, పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కార్మికులకు కనీస
# వేతనాలను పెంచడం హర్షణీయం

**ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు గొనె రామారావు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనలు మండలి 73 షెడ్యూల్ కు సంబంధించిన కనీసం వేతనాలు పెంపు పై ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు గొనె రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు కోటి 11 లక్షల మంది కార్మికుల కుటుంబాలకు మేలు జరిగే విధంగా గత 10 ఏళ్లుగా పెరగని కనీస వేతనాలను ప్రస్తుత ప్రభుత్వం పెంచడం ద్వారా కార్మికుల జీవితాల్లో నూతన ఆశలు నింపిందన్నారు.పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాల సందర్భంగా ఈ నిర్ణయం కార్మిక కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందది పేర్కొన్నారు.ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక భద్రత, జీవన ప్రమాణాల మెరుగుదల కలుగుతుందది తెలిపారు.ముఖ్యంగా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ రంగాల్లో పనిచేస్తున్న యువ ఉద్యోగులకు కూడా ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడైన మా ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి ఈ మండలిలో సభ్యులుగా ఉండటం మాకు ఎంతో గర్వకారణం అన్నారు. కార్మిక సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేస్తున్న పిచ్చిరెడ్డి ఈ వేతనాలు పెంపులో కీలకపాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి కనీస వేతనం మండలి చైర్మన్ డాక్టర్ జనక ప్రసాద్ కి సంబంధిత మంత్రివర్గ సభ్యులకు కార్మికుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు.

## రాయిపల్లి డ్యాం నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన
# నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, నారాయణఖేడ్ :** మానూర్ మండలం రాయిపల్లి గ్రామంలో సింగూర్ నీటి నిల్వ కొరకు ప్రతిపాదిత డ్యాం నిర్మాణ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు పడింది. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ యొక్క డ్యాం కొరకు ఎంతో కృషితో వారి సహకారంతో ఉన్నతాధికారుల బృందం రాయిపల్లి గ్రామంలో పర్యటించి, డ్యాం నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించింది.ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నీటి నిల్వ సామర్థ్యం, భూసేకరణ మరియు డ్యాం డిజైన్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ఆయన సూచనల మేరకే ఈ రోజు అత్యున్నత స్థాయి అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలన జరిపారని అధికారులు తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించిన తదుపరి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ప్రముఖ అధికారులు పాల్గొన్నారు.

వారిలో:

రాజమ్మ (చీఫ్ ఇంజనీర్), పోచమల్లు (సూపరింటెండెంట్ ఇంజనీర్), రఘునాథరావు (సూపరింటెండెంట్ ఇంజనీర్),

సుందర్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్),

జలేందర్ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), విద్యా మేడం (అసిస్టెంట్ ఇంజనీర్), ప్రకాష్ (అసిస్టెంట్ ఇంజనీర్) ఉన్నారు.పాల్గొన్న స్థానిక నాయకులు,అధికారుల వెంట ఈ పరిశీలన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని ప్రాజెక్టు ఆవశ్యకతను అధికారులకు వివరించారు. పాల్గొన్న వారిలో మాజీ సర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపీటీసీ ధోండి పటేల్, మాష్ పటేల్ మరియు రాయిపల్లి గ్రామస్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ డ్యాం నిర్మాణం చేపడితే ఈ ప్రాంతం ఎంతో సస్యశ్యామలం అవుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

# "మూడు అతిపెద్ద ప్రమాదాలు రాబోతున్నాయి..
## భారత్ కు తీవ్ర హెచ్చరికలు "



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ బ్యూరో :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్- అమెరికా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు సంక్షోభంలో మునిగిపోయాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ దేశాలకు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. ప్రపంచ దేశాలతో పాటు భారత్ లోనూ గణనీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగాయి. వారం రోజుల వ్యవధిలోనే కేంద్రం రెండు సార్లు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ లో రూపాయి విలువ పడిపోతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థపై ప్రముఖ ఆర్థికవేత్త, ఐ.ఎమ్.ఎఫ్ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా భారత్ ట్రిబుల్ డేంజర్ ను ఎదుర్కుంటోందని ఐ.ఎమ్.ఎఫ్ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సంక్షోభం జూన్ వరకు కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు బ్యారెల్ కు 140 డాలర్ల వరకూ పెరిగే అవకాశం ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినప్పటికీ.. భారత ప్రభుత్వం సబ్సిడీల రూపంలో ఆర్థిక భారాన్ని తానే భరిస్తూ దేశీయంగా ధరలను పెంచడం లేదు. అయితే ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.అలాగే ఇంధన ధరలు పెరుగుదల కేవలం రవాణాకు మాత్రమే కాకుండా ఎల్పీజీ, ఎల్ఎన్జీ, ఎరువుల ధరలపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని ఐ.ఎమ్.ఎఫ్ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో దేశంలో నిత్యావసర ధరలు పెరుగుతాయని.. ద్రవ్యోల్బణం వేగంగా పైకి ఎగబాకే ప్రమాదం ఉందని సంకేతం ఇచ్చారు. మరోవైపు ఫిబ్రవరిలో డాలర్ తో పోల్చితే రూ. 91 ఉన్న భారత రూపాయి విలువ రూ. 97 కు పడిపోయింది. ముడిచమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడం వల్ల రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం రూపాయి విలువ కంటే ఉద్యోగాల కల్పన, ద్రవ్యోల్బణం నియంత్రణ, ఆర్థిక వృద్ధి పైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఇక అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం అధికంగా ఉన్నప్పటికీ భారత్ లో దేశీయ డిమాండ్ లు అధికంగా ఉండటం, మౌలిక వసతులపై పెట్టుబడులు, 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉండటం కారణంగా భారత్ ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఇంధన ధరల భారం సామాన్యులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వం పేద కుటుంబాలకు నేరుగా నగదు బదిలీ చేయాలని, ఇబ్బందుల్లో ఉన్న చిన్న పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించి ఆదుకోవాలని సూచించారు.



## రాజపేటలో వివోఏ ల
# నిరసన దీక్ష.....

**హైదరాబాద్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ముందు గురువారం మూడవ రోజు ఐకెపి వివోఏ ల నిరసన దీక్ష కొనసాగింది. ప్రత్యేకంగా టెంట్ వేసుకొని కార్యాలయం ముందు బైఠాయించి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు వివోఎల గౌరవ వేతనం, ఉద్యోగ భద్రత, పని భారం తగ్గింపు అనే ముఖ్య అంశాలపై నిరసన కార్యక్రమం జరిగింది. వివోఏ లకు కనీసం వేతనం 20000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన వారిని సీసీగా పదోన్నతులు కల్పించాలని, 20 లక్షల రూపాయల ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలని, ట్యాబ్ సౌకర్యం కల్పించి 58 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు.

## నరసింహులు కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరిక ఆర్థిక సాయం



**హైదరాబాద్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన మార్క నరసింహులు కల్లుగీత వృత్తి చేస్తూ ఇటీవల తాడిచెట్టు పై నుండి జారిపడడం వల్ల వెన్నుపూసకు తీవ్ర గాయాలు కాగా, వృత్తి చేయలేని పరిస్థితిలో ఉండడం వలన తన కుటుంబం జీవించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటుందని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా వారు గురువారం ఆర్థిక సాయం చేశారు. ప్రతినిధి నాతి గణేష్, నరసింహులు కుటుంబానికి పదివేల రూపాయలలు అందజేశారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ధూపటి వెంకటేష్, నమిలే మహేందర్, రఘునాథపురం, సర్పంచ్ పల్లె సంతోష్, మాజీ ఎంపీటీసీ బుడిగ పెంటయ్య గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్, మండల కార్యదర్శి బత్తిని సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు , పాముకుంట సర్పంచ్ రంగ నరేష్ పాండవుల బసవరాజు ల ద్వారా అందజేశారు ఈ కార్యక్రమంలో రఘునాథపురం గ్రామ సొసైటీ అధ్యక్షుడు బత్తిని బలరాం, వెంకటేష్, పరుషరాములు, డొంకిన భాస్కర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు

## వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21 యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన ఊకంటి వెంకట్ రెడ్డి మరణించగా గురువారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ ఉకంటి అరుణ బుచ్చిరెడ్డి లను పరామర్శించారు. సునీత మహేందర్ రెడ్డి వెంట రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, కాల్వపల్లి మాజీ సర్పంచి ఇంజ నరసయ్య, మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్, ఆలేరు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, మాజీ సర్పంచి రామిండ్ల నరేందర్, సోషల్ మీడియా కన్వీనర్ గంధ మల్ల సురేష్, దగ్గుల విష్ణు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఊకంటి వెంకట్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

## స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి. ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించిన పి సి ఆర్.. ప్రభుత్వ హాస్పిటల్ లో మహిళాలకు పేషంట్ వృద్దులకు పండ్ల పంపిణీ. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సర్పంచ్ లు మాజీ నాయకులు ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సర్పంచ్ లు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### పాల్గొన్న వి కె సీ ఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వి కె సీ ఎం ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా పెనగడప గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు బీపీ, మధుమేహం సుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. సింగరేణి సంస్థ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ శ్రీమతి లలిత కుమారి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి, ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. వి కె సీ ఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీమతి లలిత కుమారి వి.కె.సి.ఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు , వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్ , ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్ , ఐన్ టీ యూ సి నాయకులు గోపు కుమార్ ఇతర వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## డ్రైవర్స్ రెస్ట్ హాల్ ప్రారంభించిన జి.ఎం.ఎం. షాలెం రాజు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** కొత్తగూడెం ఏరియా జి.ఎం కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైవర్స్ రెస్ట్ హాల్ ను ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు ప్రారంభించారు. డ్రైవర్లకు మెరుగైన సౌకర్యాలు, విశ్రాంతికి అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ఈ రెస్ట్ హాల్ ను ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నూతన రెస్ట్ హాల్ లో డ్రైవర్లకు సౌకర్యవంతమైన సీటింగ్, విశ్రాంతికి అనుకూలమైన వాతావరణం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ, తమ కోసం ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో రెస్ట్ హాల్ ఏర్పాటు చేసిన జి.ఎం ఎం. షాలెం రాజు కి, సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎస్.ఓ.టు జి.ఎం కోటిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎం ఎం. షాలెం రాజు , ఎస్.ఓ. టు జి.ఎం కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ , ఏజీఎం (ఫైనాన్స్ ) బీభత్స ,వికేసిఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు డి.వై.ఎస్.ఇరాజారాం, పర్సనల్ మేనేజర్ ఎల్ .తిరుపతి ,సీనియర్ పిఓ ఎం. మురలి, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, (ఎస్ సీ/ఎస్ టీ వెల్ఫేర్ జనరల్ సెక్రెటరీ) అంతోటి నాగేశ్వరరావు, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు డ్రైవర్స్ పాల్గొన్నారు

## సొంత ప్రజలపై బాంబులు వేసే దేశం మీది..

# ఐరాస వేదికగా పాక్‌కు భారత్ వార్నింగ్!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ బ్యూరో :** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాకిస్తాన్‌పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అంతర్గత వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పొరుగు దేశాలపై పాక్ హింసను ప్రేరేపిస్తోందని ధ్వజమెత్తింది. సాయుధ ఘర్షణల్లో పౌరుల రక్షణపై జరిగిన వార్షిక బహిరంగ చర్చలో పాక్ ప్రతినిధి జమ్మూ కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా, ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, అంబాసిడర్ హరీష్ పర్వతనేని ఘాటుగా సమాధానమిచ్చారు. సొంత ప్రజలపైనే బాంబులు వేస్తూ, క్రూరమైన నరమేధానికి పాల్పడిన చరిత్ర ఉన్న పాకిస్తాన్.. భారత్ అంతర్గత విషయాల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో పవిత్ర రంజాన్ మాసంలో కాబూల్‌లోని 'ఓమిద్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్' పై పాకిస్తాన్ జరిపిన అనాగరిక వైమానిక దాడిని ఆయన ప్రపంచ దేశాలకు గుర్తుచేశారు. ప్రార్థనల అనంతరం రోగులు మసీదు వెలుపలికి వస్తున్న సమయంలో జరిగిన ఈ దారుణ దాడిలో 269 మంది పౌరులు మరణించగా, 122 మంది గాయపడ్డారని ఐరాస నివేదికలను ఉటంకించారు. సైనిక లక్ష్యం కాని ఒక వైద్యశాలపై దాడి చేయడం పాక్ పిరికితనానికి, అమానవీయతకు నిదర్శనమన్నారు. పాక్ సరిహద్దు హింస కారణంగా 94,000 మందికి పైగా ఆఫ్ఘన్ పౌరులు నిరాశ్రయులయ్యారని మండిపడ్డారు. చీకట్లో అమాయక పౌరులను టార్గెట్ చేస్తూ, అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనమని పర్వతనేని విమర్శించారు. 1971లో 'ఆపరేషన్ సెర్చ్‌లైట్' పేరుతో పాక్ సైన్యం స్వయంగా 4 లక్షల మంది మహిళలపై క్రూరమైన అత్యాచారాలకు, వ్యవస్థీకృత నరమేధానికి పాల్పడిన చరిత్రను ఆయన గుర్తుచేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు పాకిస్తాన్‌కు లేదని స్పష్టం చేస్తూ, పాక్ చేసిన ఆరోపణలను భారత్ పూర్తిగా తిరస్కరించింది.

## డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

### బీఎస్పీ నాయకుడు బందల కిరణ్ కుమార్ డిమాండ్



**హైదరాబాద్ పల్స్, మే 21, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంపై బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బందల కిరణ్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీవో, ఎంపీవో, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు బదిలీల తర్వాత ఇప్పటికీ భర్తీ చేయకపోవడం వల్ల మండల పరిపాలన తీవ్రంగా దెబ్బతింటోందని ఆయన విమర్శించారు. ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ప్రస్తుతం సిబ్బంది కొరతతో సమస్యల కేంద్రాలుగా మారాయని ఆయన అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ పథకం, పింఛన్లు, బిల్లుల ఆమోదాలు వంటి అనేక కీలక కార్యక్రమాలు ఎంపీడీవో కార్యాలయం ఆధ్వర్యంలో కొనసాగుతాయని, అయితే ప్రధాన అధికారులు లేకపోవడంతో పనులు తీవ్ర ఆలస్యానికి గురవుతున్నాయని తెలిపారు. ఖాళీ పోస్టుల కారణంగా ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అధిక పని భారం పడుతుండటంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయని, చిన్న చిన్న పనుల కోసం ప్రజలు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజాప్రతినిధులు నిత్యం కార్యాలయానికి వస్తున్నప్పటికీ సరైన అధికారులు లేక పనులు సకాలంలో పూర్తికావడం లేదన్నారు. గ్రామీణ అభివృద్ధిపై ప్రభుత్వం పెద్దఎత్తున ప్రకటనలు చేస్తూ, మరోవైపు మండల స్థాయి కార్యాలయాల్లో కనీస సిబ్బందిని కూడా నియమించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను అత్యవసరంగా భర్తీ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బహుజన్ సమాజ్ పార్టీ హెచ్చరించింది.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన డోర్నకల్ సీఐ చంద్రమౌళి



**హైదరాబాద్ పల్స్, మే 21, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బూర్గుపహాడు గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చెరుకుపల్లి ఎర్రయ్య జీవనోపాధి కోసం వాగులో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఎర్రయ్య ఆకస్మిక మరణంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెరుకుపల్లి ఎర్రయ్య కుటుంబం అత్యంత నిరుపేద స్థితిలో జీవనం సాగిస్తున్నట్లు తెలుసుకున్న డోర్నకల్ సీఐ చంద్రమౌళి మానవత్వంతో స్పందించారు. బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి వారి దుఃఖంలో భాగస్వామ్యమయ్యారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తక్షణ సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పోలీస్ అధికారిగా తన బాధ్యతలకే పరిమితం కాకుండా మానవీయ కోణంలో ముందుకు వచ్చి సహాయం చేసిన సీఐ చంద్రమౌళి చర్యను గ్రామస్థులు అభినందిస్తున్నారు. కష్టకాలంలో ఆదుకోవడం ద్వారా బాధిత కుటుంబానికి పెద్ద ఊరటనిచ్చారని తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "అధికార హోదాలో ఉన్నప్పటికీ సామాన్య ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి అండగా నిలవడం గొప్ప విషయం. సీఐ చంద్రమౌళి చూపిన సహృదయత ఎప్పటికీ మరిచిపోలేం" అని పేర్కొన్నారు. బూర్గుపహాడు గ్రామ ప్రజల తరఫున సీఐ చంద్రమౌళి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## దేశవ్యాప్తంగా డీఆర్ఐ బిగ్ ఆపరేషన్: ఈ-సిగరెట్ల స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ డెస్క్:** దేశంలో నిషేధించిన ఈ-సిగరెట్లు, వేప్స్ అక్రమ రవాణా చేస్తున్న భారీ స్మగ్లింగ్ రాకెట్ ముఠాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో భారీ ఎత్తున నిషేధిత నికోటిన్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ-సిగరెట్ల స్మగ్లింగ్‌పై పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన డీఆర్ఐ అధికారులు దేశంలోని కీలక రాష్ట్రాలైన ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్‌లలో మెరుపు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో దాదాపు రూ.120 కోట్ల మార్కెట్ విలువ కలిగిన 3 లక్షలకు పైగా ఈ-సిగరెట్లు, వివిధ రకాల వేప్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేశంలో నిషేధించిన నికోటిన్ ఉత్పత్తుల అక్రమ దిగుమతిపై డీఆర్ఐ నిరంతరం ఫోకస్ పెట్టింది. అయితే ఈ స్మగ్లింగ్ ముఠా అంతర్జాతీయ కస్టమ్స్ కళ్లు గప్పి, వివిధ పోర్టులు, ఎయిర్‌పోర్టులు ద్వారా బ్లాక్ మార్కెట్లలో యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## డ్రైనేజీ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో 12 వ వార్డ్ పగిడిపల్లిలొ అండర్ డ్రైనేజీ పనులకు ప్రారంభించిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్, కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్ ఈ కార్యక్రమంలొ వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో పలు సీసీ రోడ్డు పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శంకుస్థాపన చేశారు. ఆలేరు పట్టణంలోని 7వ వార్డు మార్కండేయ కలనిలో, 9వ వార్డు బీరప్ప స్వామి ఆలయం వద్ద, వైకుంఠ దామమ్ వద్ద సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

## ఇంజ మహేష్ ను సన్మానించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఐ.ఎన్.టి.యు.సి -327 యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి ఇంజ మహేష్ మేడే రోజు శ్రమశక్తి అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం ప్రభుత్వ విప్, డిసిసి అధ్యక్షులు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య శాల్వతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బర్రె జాంగిర్, ఎస్సీ ఉమ్మడి జిల్లా పరిశీలకులు మందల కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, రాజపేట మండలం మాజీ వైస్ ఎంపీపీ రాముగొల్ల కృష్ణ, కలకుంట్ల సంపత్, మంద శివ, గుడ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్, రేగు సిద్ధులు, రాశీగల్ల కృష్ణ, తిరుపతి, బత్తిని సుధాకర్, తదితరులు ఉన్నారు.

## సుభాష్ రెడ్డిని కాంగ్రెస్ నాయకుల పరామర్శ...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం సోమవారం గ్రామానికి చెందిన పెంట సుభాష్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పాండవుల బసవరాజ్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బేగంపేటలో రెండు కుటుంబాలకు బియ్యం పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం బేగంపేట గ్రామంలో ఇటివల మరణించిన నాగారం పెద్దరాజమ్మ, కొమ్ము బాలమ్మ కుటుంబాలకు గురువారం సహాయంగా 50 కిలోల చొప్పున 100 కిలోల బియ్యం సర్పంచ్ ఇండ్ల అనుష- సుమన్, అందించి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జెల్ల భాస్కర్, ప్యాట క్రాంతి, గ్రామ పెద్దలు భోగ హరినాథ్, చిగుర్ల గణేష్, బిచ్చల భాస్కర్, చింతిగారి రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు

## శిలాఫలకం వద్ద బీఆర్ఎస్ నాయకుల భారీ నిరసన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పొట్టిమర్రి వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు గురువారం నిరసన తెలియజేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని పేర్కొన్నారు. ఈ ఘటనకు నిరసనగా బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు సంఘటన స్థలాన్ని వద్ద  భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. శిలాఫలకం ధ్వంసానికి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షసాధింపుతో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరైంది కాదని మండిపడ్డారు.నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి కోసం చేపట్టిన పనుల గుర్తింపుకు సంబంధించిన శిలాఫలకాలు ధ్వంసం సబబు కాదన్నారు. నినాదాలు చేశారు. రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, కాల్వపల్లి మాజీ సర్పంచి ఇంజన్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్, ఆలేరు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, మాజీ సర్పంచి రామిండ్ల నరేందర్, సోషల్ మీడియా కన్వీనర్ గంధ మల్ల సురేష్, దగ్గుల విష్ణు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధునిక భారతదేశానికి పునాదులు వేసిన దార్శనికుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, పటాన్ చెరు:**
భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాలు, దూరదృష్టితో కూడిన విధానాలే నేటి నవభారత ప్రగతికి బలమైన పునాదులని స్పష్టం చేశారు.1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 1988లో ఓటు హక్కు కనీస వయస్సును 18 ఏళ్లకు తగ్గించడం వంటి సంస్కరణలు దేశ రాజకీయ స్థిరత్వానికి, యువత భాగస్వామ్యానికి దోహదపడ్డాయని తెలిపారు. 1986 జాతీయ విద్యా విధానం ద్వారా 'నవోదయ విద్యాలయాలు' స్థాపన, కంప్యూటర్ విప్లవానికి పునాదులు వేయడం వంటివి నేటి భారతదేశం ఐటీ, టెలికాం రంగాలలో ఎదగడానికి కారణమయ్యాయని పేర్కొన్నారు.మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ, మహిళా రిజర్వేషన్ల ఆలోచనకు ఆయనే శ్రీకారం చుట్టారని, ఇది తదనంతర రాజ్యాంగ సవరణలకు మార్గదర్శకమైందని వివరించారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## దుర్గమాత పండుగా ఘనంగా నిర్వహించాలి

### : తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** జూన్ 2 న రాయగిరిలో జరగబోయే దుర్గమాత పండుగ సందర్భంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ... దుర్గమాత పండుగా ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపాలిటీ కొండల్ రావ్, రూరల్ ఎస్సై అనిల్ కుమార్, మున్సిపల్ ఏఈ సురేష్ మరియు మూడో వాడు కౌన్సిలర్ పాల్తీయ వెంకటేష్, కో ఆప్షన్ మేంబర్ పల్లెర్ల యాదగిరి, దాసరి పాండు, ఔశెట్టి పాండు, ఔశెట్టి మల్లేష్, సుధగాని మధు, సామల రవీందర్, మంద రఘుమారెడ్డి, బత్తిని జితేందర్, నర్రా శేఖర్, చింతల మల్లేష్, ఈదులకంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట మండలం నుండి అక్రమ మట్టి రవాణా

**అర్ధరాత్రి అక్రమ రవాణాతో రోడ్డుపై పడిన మట్టి**

**అధికారుల అలసత్వంతో అర్ధరాత్రి సాగుతున్న దందా**






**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21 యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** చెరువులలో నుండి విలువైన మట్టి రాజపేట మండలం మీదుగా అర్ధరాత్రి అక్రమంగా రవాణా సాగుతోంది. గురువారం ఉదయం నమిల, దూది వెంకటాపురం చౌరస్తా వద్ద రోడ్డుపై పడివున్న మట్టిని చూసిన రైతులు ప్రజలు అధికారుల తీరుపై విమర్శిస్తున్నారు. రాజపేట మండలంలో ఏ చెరువు నుండి ఈ అక్రమ మట్టి రవాణా దందా కొనసాగుతుంది అనే విషయాన్ని సంబంధిత అధికారులు సీరియస్ గా తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. పరిస్థితిని బట్టి చూస్తే అధికారుల ప్రమేయంతోనే అర్ధరాత్రి వేళలో మట్టి దందా కొనసాగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత పోలీసు అధికారులు పెట్రోలింగ్ పర్యవేక్షణ లోపం స్పష్టమవుతుందని విమర్శిస్తున్నారు. రాజపేట మండలం నుండే కాకుండా ఇతర మండలాల లోని చెరువుల నుండి మట్టి రవాణా అవుతున్నప్పటికీ రాజపేట మీదుగా వాహనాలు వెళుతుండగా పోలీసులు ఎందుకు పట్టించుకోవడంలేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన చెరువు మట్టి ఇటుక బట్టీలకు అక్రమంగా తరలి వెళుతుండడం చూస్తూ అధికారులు అలసత్వం వహించడం సబబు కాదని సంబంధిత శాఖల అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## జేరిపోతుల కరుణాకర్ ను సన్మానించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ గురువారం పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య,మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుంటి మల్లేష్ యాదవ్, తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జేరిపోతుల నరేందర్, వెల్పుపల్లి ఉప సర్పంచ్ ఏనుగు సిద్ధులు, ఇంజ మహేష్ తదితరులు ఉన్నారు.

## స్వామి వారికి శాశ్వత ధూపదీప నైవేద్యంకు 5,116 రూ,లు అందజేసిన దంపతులు పెండం పాండు పావని



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21 యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం కోరిన కోరికలు తీర్చే అతి మహిమాన్వితమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ను గురువారం పంచమి పునర్వసు నక్షత్రం పర్వదినాన్ని పునస్కరించుకొని చిన్న గౌరాయపల్లి వాస్తవ్యులు, పెండం పాండు ధర్మపత్ని పావని దంపతులు శ్రీ స్వామివారిని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాస చార్యులు వారికి వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు శ్రీ స్వామి వారి శాశ్వత ధూపదీప నైవేద్యంకు ఫిక్స్ డిపాజిట్ కి రూ" 5,116/- రూపాయలను ఆలయంలో శ్రీ స్వామివారికి సమర్పణ చేసి అనంతరం ఆలయ వైస్ చైర్మన్ శ్రీ రాచకొండ స్వామి కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాండు పావని దంపతులను, ఆలయ వైస్ చైర్మన్ శ్రీ రాచకొండ స్వామి ఆలయ కమిటీ సభ్యులు వారిని శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సైకిల్ యాత్ర

## మూటకొండూరు మండలంలో అభివృద్ధి పనుల పరిశీలన...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుండి మూటకొండూరు మండలం వరకు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందిస్తూ, సామాన్య ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంగా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకిల్ యాత్ర అనంతరం మూటకొండూరు మండలంలోని పలు ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతుల కష్టానికి తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం మరియు తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పనులను పరిశీలించి, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు ప్రాంత అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.





**రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు**

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మూటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. యువతకు స్ఫూర్తిగా నిలిచిన రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# దుండగుల మెరుపు దాడి.. 'పుల్వామా' మాస్టర్ మైండ్ హంజా బుర్హాన్ హతం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ డెస్క్:** పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ వేదికగా భారత్‌పై ఉగ్ర కుట్రలు పన్నుతున్న శక్తులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2019 పుల్వామా టెర్రర్ అటాక్‌లో 40 సైనికుల ప్రాణాలు తీసి సూత్రధారిగా వ్యవహరించిన అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థ టాప్ కమాండర్ అర్జుమండ్ గుల్జార్ దార్ అలియాస్ 'హంజా బుర్హాన్' పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో హతమయ్యాడు. ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన మెరుపు కాల్పుల్లో అతడు మరణించినట్లుగా తెలుస్తోంది. అయితే, భారత ప్రభుత్వం 2022లోనే బుర్హాన్‌ను టెర్రరిస్ట్‌గా ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా రత్నీపోరా ప్రాంతానికి చెందిన హంజా బుర్హాన్, అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థతో కలిసి లోయలో అనేక విధ్వంసకర చర్యలకు పాల్పడ్డాడు.

**పుల్వామా దాడితో లింక్.. ముగిసిన చాప్టర్**

భారతదేశాన్ని వణికించిన 2019 పుల్వామా దాడిలో జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాది అదిల్ అహ్మద్ దార్ పేలుడు పదార్థాలతో ఉన్న వాహనాన్ని సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌కి ఢీకొట్టడంతో 40 మంది జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. ఈ కుట్ర వెనుక నెట్‌వర్క్ నడిపించడంలో, వ్యూహాలు రచించడంలో అల్-బద్ర్ అసోసియేట్ మెంబర్, కమాండర్ హంజా బుర్హాన్ కీలక పాత్ర పోషించాడని నిఘా వర్గాల దర్యాప్తులో తేలింది. తాజాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ముజఫరాబాద్‌లో హంజా బుర్హాన్‌ను టార్గెట్ చేసిన దుండగులు అతడిపై పలు రౌండ్ల బుల్లెట్ల వర్షం కురిపించి అక్కడికక్కడే మట్టుబెట్టారు. అయితే, బుర్హాన్ మృతితో భారత్‌లో సంబురాలు అంబురాన్ని అంటాయి.



# గణేష్ గడ్డ దేవాలయానికి ప్రత్యేక ర్యాంపు: ఎమ్మెల్యే జిఎంఆర్

**జాతీయ రహదారి విస్తరణ అధికారులతో సమీక్ష..**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారంలో గల గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక గణపతి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ర్యాంపు, మెట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం జాతీయ రహదారి విస్తరణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, ఆలయ కమిటీ పాలకవర్గం, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి దేవాలయం సమీపంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే గణేష్ గడ్డ దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని తెలిపారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గుడి సమీపంలో చేపడుతున్న పనుల మూలంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి నుండి నేరుగా దేవాలయం పరిసరాల్లోకి వచ్చే విధంగా ప్రత్యేక ర్యాంపు ఏర్పాటు చేయడంతో పాటు, స్వాగత తోరణం నుండి ఆలయం వరకు మెట్ల నిర్మాణం, నూతన ఆర్చి, గుడి చుట్టూ 50 అడుగుల సామర్థ్యంతో సిసి ఫ్లోరింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పైన పేర్కొన్న పనులన్నీ పూర్తి చేయాలని జాతీయ రహదారుల డిఈ రామకృష్ణను ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకపోతే.. గుడి సమీపంలో అండర్ పాసెజ్ సైతం నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, స్థానిక కౌన్సిలర్లు రాజు, లత, మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, ఆలయ ఈవో లావణ్య, సీనియర్ నాయకులు నర్సింహ రెడ్డి, శ్రీకాంత్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మోదీ కొత్త టీంలో తెలంగాణ నుంచి ఊహించని మార్పులు..?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ బ్యూరో:** తెలంగాణ బీజేపీలో కీలక అప్డేట్. కేంద్ర మంత్రివర్గ విస్తరణ దిశగా కసరత్తు జరుగుతోంది. ప్రధాని మోదీ కేబినెట్ లోని అందరు మంత్రులతో ఈ రోజు భేటీ కానున్నారు. అందరూ ఢిల్లీలో ఉండాలని నిర్దేశించారు. ప్రభుత్వం- పార్టీలో కీలక మార్పుల దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల పైన గురి పెట్టిన బీజేపీ.. అందుకు అనుగుణంగా నిర్ణయాలకు సిద్ధం అవుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఢిల్లీలో అందుబాటులో ఉండాలని సూచించింది. కేంద్ర కేబినెట్ లో తెలంగాణ నుంచి మార్పులు - చేర్పులు ఖాయంగా కనిపిస్తోంది.కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్దం అవుతోంది. తెలంగాణ నుంచి కీలక మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్ లో దాదాపు 30 మంది మంత్రులకు ఉద్వాసన తప్పదనే చర్చ జరుగుతోంది. కొందరికి పార్టీ బాధ్యతలు అప్పగించనున్నారు. వచ్చే ఏడాది ఎన్నిక లు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కనుంది. తెలంగాణ నుంచి ప్రస్తుతం కిషన్ రెడ్డి, బండి కేంద్ర మంత్రులుగా ఉన్నారు. వీరిలో ఒకరిని పార్టీ సేవలకు వినియోగించుకునే ఆలోచనలో పార్టీ అధి నాయకత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా తెలంగాణ సామాజిక - రాజకీయ సమీకరణాలను పరిగణలోకి తీసుకొని మరో ఇద్దరికి కొత్తగా అవకాశం ఇస్తారని తెలుస్తోంది. పార్టీకి చెందిన సీనియర్ నేతకు గవర్నర్ పదవి ఇవ్వటం దాదాపు ఖాయమైంది. కొత్తగా మంత్రుల రేసు లో డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ ఉన్నారు. అయితే.. బండి సంజయ్ మంత్రి గా కొనసాగితే అర్వింద్ కు అవకాశం ఉండదని చెబుతున్నారు



**తెలంగాణ పైన స్పెషల్ ఫోకస్**

అదే విధంగా కిషన్ రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే డీకే అరుణకు మంత్రిగా ఛాన్స్ దక్కుతుందని అంచనా వేస్తున్నారు. ఈటల రాజేందర్ సైతం మంత్రి పదవి రేసులో ఉన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా మార్పులు చేర్పులు ఉండనున్నాయి. ఇక.. ప్రధాని మోదీ తెలంగాణ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసారు. బండి సంజయ్ స్థానం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. బండి సంజయ్ కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. అయితే, తాజా ఘటనల వలన బండి పైన ఎలాంటి ప్రభావం ఉండదని పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. కాగా.. కిషన్ రెడ్డిని కొనసాగిస్తే.. శాఖ మార్పు ఉంటుందని ఢిల్లీ నేతల సమాచారం. అయితే.. ప్రస్తుతం ఉన్న ఇద్దరు మంత్రుల సంఖ్య మార్పులు.. చేర్పులతో మూడుకు చేరుతుందని చెబుతున్నారు. దీంతో.. ఈ రోజు ఢిల్లీలో ప్రధాని మోదీ మంత్రులతో భేటీ తరువాత.. తాజా ఆలోచనల పైన పూర్తి స్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎంపీ చామల ఘన నివాళి...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారత రత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ సచివాలయంలోని ఆయన విగ్రహానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఎంపీ స్మరించుకున్నారు. స్థానిక పాలనను బలోపేతం చేసేలా తీసుకొచ్చిన సంస్కరణలు, సమాచార సాంకేతిక రంగంలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు దేశ భవిష్యత్తును మార్చేశాయని కొనియాడారు. రాజీవ్ గాంధీ దూరదృష్టితోనే భారత్ ఆధునిక సాంకేతిక రంగంలో ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు.

# బెంగాల్ సర్కార్ కీలక నిర్ణయం... ఇక మదర్సాల్లో 'వందేమాతరం' తప్పనిసరి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్ లో ప్రభుత్వ మారిన నేపథ్యంలో పాలనా వ్యవస్థలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా సీఎం సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు.. తాజాగా రాష్ట్రంలోని అన్ని మదర్సాల్లో తరగతులు ప్రారంభం కావడానికి ముందు జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేశారు. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాలు, మదర్సా విద్యాశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆ ఉత్తర్వులలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడిచే, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎయిడెడ్ మదర్సాల్లో ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులందరూ తప్పనిసరిగా వందేమాతరం పాడాలని పేర్కొన్నారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వందేమాతరం పాడాలని తెచ్చిన రూల్‌కు కొనసాగింపుగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కానీ, ప్రభుత్వ తాజా నిర్ణయంపై బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. మైనారిటీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ప్రతిపక్ష పార్టీ నేతలు ఈ ఉత్తర్వులను తీవ్రంగా తప్పుపట్టారు. సొంత నిధులతో నడిచే స్వతంత్ర మదర్సాలపై ఇలాంటి నిబంధనలను బలవంతంగా రుద్దకూడదని వాదిస్తున్నారు.

# సోషల్ మీడియాని షేక్ చేస్తున్న 'మెలోడీ' రీల్.. 24 గంటల్లోనే..



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ బ్యూరో:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన సందర్భంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీకి అరుదైన గిఫ్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తమ స్నేహానికి గుర్తుగా మెలోనీకి మోదీ పార్లె మెలోడీ చాక్లెట్లను బహుమతిగి ఇచ్చారు. ఈ గిఫ్ట్ చూసి ఇటలీ ప్రధాని ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రధానులు చేసిన ఓ రీల్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. ఈ వీడియోని మెలోనీ పోస్టు చేసిన కేవలం 24 గంటల్లోనే 17.5 కోట్ల మంది వీక్షించారు. ఇక గతంలోనూ మెలోడీ వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి. గతంలో సి.ఒ.పి 28 సదస్సు సందర్భంగా మెలోనీ చేసిన 'హలో ఫ్రమ్ ది మెలోడి టీమ్' వీడియోకి 67 లక్షలకుపైగా వ్యూస్ వచ్చాయి. అదే సమయంలో వీరిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న ఓ వీడియో దాదాపు 23 లక్షల వ్యూస్‌ని రాబట్టింది. దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన నీలం మధు ముదిరాజ్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21 :** ఇస్నాపూర్: రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆహ్వానంతో ఘన స్మారక కార్యక్రమం జరిగింది. మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు మరియు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని దేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడిగా స్మరించారు. 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రవేశపెట్టడం, 1988లో ఓటు హక్కు కనీస వయస్సు 21 నుండి 18కి తగ్గించడంతో యవతను ప్రజాస్వామ్యంలో చేర్చడం, 1986 జాతీయ విద్యా విధానంతో నవోదయ విద్యాలయాలు స్థాపించి గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించినట్టు గుర్తుచేశారు. దేశ ఐటి, టెలికాం విప్లవానికి రాజీవ్ గాంధీ వ్యక్తిగతంగా పెట్టిన కంప్యూటర్ పునాదులే కారణమన్నారు. దేశ సమగ్రత కోసం ఆయన ప్రాణాలు నిచ్చిన త్యాగాన్ని గుర్తుచేసి, కాంగ్రెస్ శ్రేణులు అతని ఆశయ సాధనలో కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.క్రింది స్థానిక కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు: పడమటి గోపాల్ రెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, అల్లం గారి నరసింహారెడ్డి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, నారాయణదాసు, మన్నే రాఘవేంద్ర, మణికంఠ, సందీప్ గౌడ్, లక్డారం మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, ముత్తంగి అశోక్, వెంకటేశ్, మురళి.

## పోచారం పరిసరాల్లో మొసలి కనిపించిన సంఘటన

### ఫారెస్ట్ శాఖ పరీక్షించీ అప్రమత్తం



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21 :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పరిధిలోని పోచారం పరిసర ప్రాంతాల్లో మొసలి ఆచూకీపై ఫారెస్ట్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వరదతో జలప్రవాహం ఎక్కువగా ఉండడంతో మొసలి వెంటాల్/ఆనవాళ్లు దొరకలేదు; అధికారులు వెనుదిరిగారు.స్థానికులను భయపడవద్దని, అప్రమత్తంగా ఉండి ఆవశ్యకసమయంలో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చేలా సూచన.వ్యూహము: మొసలి వాగు వద్దున కనిపిస్తే వెంటనే ఫారెస్ట్ శాఖకు ఫోన్ చేస్తే వారు వచ్చి పట్టుకుంటారు.ఫారెస్ట్ అధికారులు తెలిపారు: ఈ నది మంజీరా నదికి అనుసంధానం కలిగి ఉండడం వల్ల మొసలి తాను చెందిన ప్రాంతానికి తిరిగి వెళ్లే అవకాశంఉన్నది.

## ధాన్యం కొనుగోళ్ల జాప్యం పై కలెక్టర్ అనురాగ్ జయంతికి బీజేపీ నాయకుల వినతి....

### ధాన్యం కొనుగోళ్లలో తరుగు, తేమ పేరుతో దోపిడీని అరికట్టాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, మౌలిక వసతుల కొరత, తరుగు, తేమ పేరుతో దోపిడీని అరికట్టాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టి, ధాన్యం లిఫ్టింగ్ అనంతరం వారం రోజుల్లోపు రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ చేయాలని డిమాండ్ చేశారు. పోచంపల్లిలో కొందరు రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతులు పండించిన ధాన్యంలో అధిక కోతలు విధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, డీఎస్‌వో ద్వారా వివరాలు సేకరించి రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ్, తుమ్మల మురళీధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కదూరి అచ్చయ్య, చందా మహేందర్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు పన్నాల చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, కమిటీకారి కృష్ణ, తడిసిన మల్లారెడ్డి, వైజయంతి, కస్తూరి మాధురి చంద్ర తదితరులు పాల్గొన్నారు.



## సంక్షోభం వేళ భారత్ కు జాక్ పాట్..
# భారీగా బయటపడిన ఖనిజ నిక్షేపాలు..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 21, సెంట్రల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతోపాటు భారత్ లోనూ సంక్షోభం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల మధ్య భారత్ కు జాక్ పాట్ తగిలింది. బీహార్.. సంప్రదాయ వ్యవసాయ, చారిత్రక గుర్తింపును దాటి, ఇప్పుడు భారత్ లో అరుదైన ఖనిజ వనరులకు కేంద్రంగా ఆవిర్భవిస్తోంది. అరుదైన భూఉపరితల మూలకాలు, కోబాల్ట్, టైటానియం, పల్లాడియం, గ్లౌకోనైట్ వంటి విలువైన ఖనిజాల ఆవిష్కరణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 14 మైనింగ్ బ్లాక్‌లను వేలం వేయడానికి సిద్ధమవుతోంది.ఈ ఆవిష్కరణలు బీహార్‌లో పరిశ్రమలు, ఉపాధికి కొత్త మార్గాలను తెరుస్తాయని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖా మంత్రి ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలు రాష్ట్ర ఆర్థికరూపాన్ని గణనీయంగా మార్చగలవు. ఈ కొత్త ఖనిజ వనరులు బీహార్ పారిశ్రామిక భవిష్యత్తును పునర్నిర్మించగలవని ప్రభుత్వం నమ్ముతోందని అన్నారు. బాంకా జిల్లాలో కోబాల్ట్ నిక్షేపాలు బయపడ్డాయి. భాగల్పూర్ లోని బటాషేశ్వర్‌స్థాన్ ప్రాంతంలో అరుదైన భూఉపరితల మూలకాలు, క్రోమైట్ జాడలు గుర్తించారు. అదేవిధంగా బాంకా జిల్లాలోని పిండరక్ ప్రాంతంలో రాగి నిక్షేపాలు లభించాయి. నవాదా జిల్లాలో, వెనాడియం-రిచ్ మేగ్నటైట్, ఇల్మనైట్ కలిగిన మైనింగ్ బ్లాక్‌లను గుర్తించి వేలానికి సిద్ధం చేశారు.రోహ్‌తాస్ జిల్లాలో గ్లౌకోనైట్ ఉన్న మూడు బ్లాకులను కూడా ఈ వేలం ప్రక్రియలో చేర్చారు. ఈ మైనింగ్ బ్లాక్‌ల వేలం ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టిసి లిమిటెడ్ ఇప్పటికే ఈ బ్లాక్‌ల కోసం బిడ్‌లను ఆహ్వానించింది. వేలం మే 20 తర్వాత ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలను పెంచడానికి వీలైనంత త్వరగా వాణిజ్యపరమైన తవ్వకాలు ప్రారంభించడమే దీని ప్రాథమిక లక్ష్యం.అరుదైన భూఉపరితల మూలకాలు ఆధునిక సాంకేతికత, రక్షణ వ్యవస్థలకు అత్యంత ముఖ్యమైనవిగా పరిగణించబడతాయి. మిస్సైల్స్, రాడార్ వ్యవస్థలు, డ్రోన్‌లు, యుద్ధ విమానాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టెలివిజన్ స్క్రీన్‌లు, వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలలో వీటిని ఉపయోగిస్తారు. బీహార్‌లో ఈ ఖనిజాల లభ్యత భారత్ భవిష్యత్ సాంకేతిక, వ్యూహాత్మక అవసరాలలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వీటి డిమాండ్ కూడా వేగంగా పెరుగుతోంది.ఈ నేపథ్యంలో భారతదేశానికి బీహార్‌లోని ఈ ఆవిష్కరణలు ఎంతో వ్యూహాత్మక, ఆర్థిక ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో అరుదైన భూఉపరితల ఖనిజాల అతిపెద్ద నిల్వలు చైనా వద్ద ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, అధునాతన సాంకేతికతల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఖనిజాల ప్రపంచ ప్రాముఖ్యత నిరంతరం పెరుగుతోంది. ఒకసారి తవ్వకాలు ప్రారంభమైతే, బీహార్ భారతదేశ ఖనిజ పటంలో ఒక ప్రధాన ఆటగాడిగా ఆవిర్భవిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. జార్ఖండ్‌కు సరిహద్దుగా ఉన్న దక్షిణ బీహార్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఖనిజ సర్వేలు జరుగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో ఏరియల్ సర్వేలు, శాటిలైట్ అధ్యయనాలు, భూగర్భ పరిశోధనలు (గ్రౌండ్ ఇన్వెస్టిగేషన్లు) చేపడుతున్నారు. జముయి జిల్లాలోని సోనో ప్రాంతంలో బంగారు నిక్షేపాల జాడలు కనుగొనబడ్డాయి, దీనిపై మరింత వివరమైన అన్వేషణ జరుగుతోంది. రాబోయే సంవత్సరాల్లో బీహార్ ఖనిజ, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త కేంద్రంగా మారుతుందని అధికారులు విశ్వసిస్తున్నారు.



## ‘సైకిల్ యాత్ర’ పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు...రైతు కాకళ్ళ నవన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతెడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలోనే లేదు ?అని రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన రైతు కాకళ్ళ నవన్ విలేకరులతో గురువారం మాట్లాడుతూ.... రాజపేట మండలంలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోనే మూలుగుతున్న ధాన్యపు రాశులు పట్టించుకోని పాలకులు! ?ఒకవైపు రోహిణి కార్తె ప్రవేశిస్తోంది మళ్లీ నాగలి పట్టి, విత్తనాలు వేసే కొత్త సాగు సీజన్ ముంగిటకొచ్చింది. కానీ రాజపేట మండలంలో రైతులు రక్తాన్ని చెమటగా మార్చి పండించిన వరి కుప్పలు ఎక్కడికక్కడే కొండల్లా పేరుకుపోయయి. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుంటే, ఆకాశం వైపు చూస్తూ రైతన్న గుండె చెరువవుతోంది. ఏ క్షణాన అకాల వర్షం ముంచెత్తుతుందోనని కంటిమీద కునుకు లేకుండా ధాన్యం కుప్పల వద్దే కావలి కాస్తున్నాడు. ప్రజా ప్రభుత్వమా? ప్రజా కంటక ప్రభుత్వమా?? “ప్రజా ప్రభుత్వం” అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన పాలకులు, నేడు అన్నదాతలను నట్టేట ముంచుతున్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరి విడనాడాలి ?ఎమ్మెల్యేకి ‘సైకిల్ యాత్ర’ పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. ?స్థానిక ఎమ్మెల్యేకి రాజకీయాలు చేయడానికి, సైకిల్ యాత్రలు చేస్తూ కాలక్షేపం చేయడానికి సమయం ఉంటుంది కానీ, ఐకేపీ కేంద్రాల్లో అల్లాడుతున్న రైతుల కష్టాలను కళ్లారా చూసి స్పందించడానికి మాత్రం సమయం దొరకడం లేదన్నారు. ఓట్ల కోసం వచ్చే నాయకులకు, ధాన్యం కుప్పల మీద కూర్చున్న రైతు కన్నీరు కనిపించకపోవడం అత్యంత విచారకరమన్నారు. ?రాజపేట మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలి. ?మిల్లింగ్ పరిమితులను పెంచి, లారీల కొరతను వెంటనే తీర్చాలి.? తరుగు పేరుతో రైతులను దోచుకునే దళారుల, మిల్లుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. ?ఇప్పటికైనా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లున్న వైఖరిని విడనాడాలి. రైతన్న కడుపు కొడితే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదు. తక్షణమే స్పందించి, ధాన్యం కొనుగోలు పూర్తి చేసి, రైతులకు చెల్లింపులు జరపాలని డిమాండ్ చేసారు.



## ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ‘విబిజీ రామ్‌జీ’ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద నిర్వహించిన కూలీల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గిస్తూ చట్టాన్ని బలహీనపరుస్తోందని ఆరోపించారు. కొత్త విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం వాటా చెల్లించాల్సి రావడం వల్ల కూలీలకు పనులు దొరకకుండా చేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పనిస్థలాల్లో రెండుసార్లు ఫోటోలు తీసే విధానం కూలీలను అవమానించేలా ఉందన్నారు. సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజుకూలీని రూ.600కు పెంచాలని, పనిముట్లు ఉచితంగా ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమనబోయిన జంగయ్య, మద్దెల శంకరయ్య, జక్కల అంజయ్య, చేగురి నర్సింహ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ రవీందర్

### ప్రజలకు మర్యాదపూర్వక సేవలు అందించాలి....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి డివిజన్ డీఎస్పీ బి.రవీందర్ గురువారం భువనగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో రిసెప్షన్ అధికారి, సిబ్బంది స్నేహపూర్వకంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. దీంతో ప్రజల్లో పోలీస్ శాఖపై గౌరవ భావం పెరుగుతుందని తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డులు, ఫైల్స్‌ను ‘5ఎస్ విధానం’ ప్రకారం క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

## సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం భువనగిరి కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్లు సోమ కృష్ణమూర్తి, రాచమల్ల వినోద్‌కుమార్ మాట్లాడుతూ... వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీర్వాదంతో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుస్స శ్రీనివాస్, అరుణ్ కిషోర్, ఎన్. విజయ్‌కుమార్, సీహెచ్ రాజు, శ్రీధర్, మోహన్, సీహెచ్ ప్రవీణ, పి. రజని, సోమ సరస్వతి, వాకిటి అరుణ తదితరులు పాల్గొన్నారు



# కీళ్ల నొప్పులకు అసలు కారణాలేంటి.. ఎన్ని రకాలుగా ఉంటాయి..?



నేటి తరుణంలో కీళ్ల నొప్పులు సాధారణ ఆరోగ్య సమస్యగా మారాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ లేదా శరీర నిర్మాణ సంబంధిత సమస్యల కారణంగా చాలా మంది ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఇందులో ముఖ్యంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియోఆర్థరైటిస్ అనే రెండు వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే చాలా మంది ఈ రెండూ ఒకటేనని భావిస్తారు. కానీ వీటి కారణాలు, లక్షణాలు, చికిత్స విధానాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది ఒక ఆటోఇమ్యూన్ వ్యాధి. అంటే శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున తన ఆరోగ్యకరమైన కణాలపైనే దాడి చేయడం. ముఖ్యంగా కీళ్ల చుట్టూ ఉండే పొరపై ప్రభావం చూపి తీవ్రమైన వాపు, నొప్పి, కీళ్లు దెబ్బతినే పరిస్థితిని కలిగిస్తుంది. ఈ వ్యాధి కేవలం కీళ్లకే పరిమితం కాకుండా చర్మం, కళ్లు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని దీర్ఘకాలికంగా నియంత్రించడం చాలా ముఖ్యం.

**ఆర్థరైటిస్‌లో ఇవి రెండూ ప్రధాన రకాలు..**

ఇక ఆస్టియోఆర్థరైటిస్ మాత్రం వయస్సు, అధిక వినియోగం లేదా కీళ్లపై ఒత్తిడి కారణంగా ఏర్పడే సమస్య. కీళ్ల మధ్య ఉండే కార్టిలేజ్ క్రమంగా దెబ్బతినడం వల్ల ఎముకలు ఒకదానికొకటి రుద్దుకోవడం మొదలవుతుంది. దీని వల్ల నొప్పి, గట్టిపడటం, కదలికల్లో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా మోకాళ్లు, నడుము, వెన్నెముక వంటి బరువు మోసే కీళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఈ రెండు వ్యాధుల లక్షణాల్లో కూడా స్పష్టమైన తేడాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో ఉదయం లేవగానే గంటల పాటు కీళ్లు గట్టిపడటం కనిపిస్తుంది. శరీర అలసట, స్వల్ప జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చు. ముఖ్యంగా శరీరంలోని రెండు వైపులా ఒకే కీళ్లు ప్రభావితమవడం దీని ప్రత్యేక లక్షణం. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే కదలికలు చేసినప్పుడు నొప్పి పెరగడం, విశ్రాంతి తీసుకుంటే కొంత ఉపశమనం కలగడం కనిపిస్తుంది. కొద్దిసేపు కూర్చున్న తర్వాత లేదా నిద్రలేచినప్పుడు తాత్కాలికంగా కీళ్లు గట్టిగా అనిపిస్తాయి. అలాగే కీళ్లు కదిలించినప్పుడు రాపిడి శబ్దం వినిపించడం కూడా ఈ సమస్యలో సాధారణం. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు జన్యుపరమైన కారణాలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ధూమపానం వంటి అంశాలు కారణమవుతాయి. ఇక ఆస్టియోఆర్థరైటిస్‌కు వయస్సు, అధిక బరువు, పాత గాయాలు, ఒకే విధమైన శారీరక పనులు ఎక్కువకాలం చేయడం వంటి కారణాలు ప్రధానంగా ఉంటాయి.

**సరైన నిర్ధారణ ముఖ్యం..**

వైద్యుల ప్రకారం, సరైన నిర్ధారణ చాలా ముఖ్యమని చెబుతున్నారు. ఆస్టియోఆర్థరైటిస్‌ను సాధారణంగా ఎక్స్‌రేలు, శారీరక పరీక్షల ద్వారా గుర్తిస్తారు. కీళ్ల మధ్య ఖాళీ తగ్గడం, ఎముక పెరుగుదల వంటి లక్షణాలు కనిపిస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ నిర్ధారణకు మాత్రం రక్తపరీక్షలు కూడా అవసరం అవుతాయి. రుమటాయిడ్ ఫ్యాక్టర్, యాంటీ-సీసీపీ యాంటీబాడీలు, ఈఎస్ఆర్, సీఆర్‌పీ వంటి ఇన్ఫ్లమేషన్ సూచికలను పరిశీలిస్తారు. చికిత్సలో కూడా రెండింటికీ వేర్వేరు విధానాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో వ్యాధి వేగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక మందులు, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధాలు, బయాలజికల్ థెరపీలు వాడతారు. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే నొప్పి నియంత్రణ, ఫిజియోథెరపీ, బరువు తగ్గించడం, జీవనశైలిలో మార్పులు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

**జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్స..**

అధిక స్థాయిలో కీళ్లు దెబ్బతిన్నప్పుడు జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అవసరం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రోబోటిక్ సాంకేతికతతో చేసే జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలు మరింత కచ్చితత్వంతో, త్వరగా కోలుకునేలా సహాయపడుతున్నాయని పేర్కొంటున్నారు. కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే బరువును నియంత్రణలో ఉంచడం, తక్కువ ఒత్తిడి కలిగించే వ్యాయామాలు చేయడం, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండకుండా తరచూ కదలికలు చేయడం కూడా కీళ్ల గట్టిపడకుండా సహాయపడుతుంది. కొన్ని వారాలకు మించి కీళ్ల నొప్పులు కొనసాగితే, వాపు, వేడి లేదా కదలికల్లో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# రాత్రి తగినంత సమయం పాటు నిద్రించినా ఉదయం నిద్ర మత్తుగా ఉంటుందా.. కారణాలు ఇవే..

నేటి బిజీ జీవితంలో చాలామంది సరిపడా నిద్రపోయినా కూడా రోజంతా అలసటగా అనిపిస్తోందని చెబుతూ ఉంటారు. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కొనే ఉంటారు. రాత్రి 7-8 గంటలు నిద్రపోయినా ఉదయం లేవగానే శరీరంలో శక్తి లేకపోవడం, రోజువారీ పనులు చేయడానికే బద్ధకంగా అనిపించడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని స్లీప్ ఫాటిగ్యూగా పిలుస్తారు. ఇది క్రమంగా పనితీరు, మానసిక స్థితి, వ్యక్తిగత జీవితం మీద కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. శరీరానికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో మంచి నిద్ర కూడా అంతే అవసరం. గాఢమైన, అంతరాయం లేని నిద్ర వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. మూడ్ సమతుల్యంగా ఉంటుంది. శరీరం రోజంతా జరిగిన అలసటను దిద్దుకుంటుంది. కానీ నిద్ర నాణ్యత సరిగా లేకపోతే ఎక్కువసేపు పడుకున్నా శరీరానికి సరైన విశ్రాంతి దక్కదు.

**స్లీప్ అప్నియా అంటే..**

శరీరం అలసటగా ఉండడానికి స్లీప్ అప్నియా అనే సమస్య కూడా ఒక కారణం. ఇది నిరంతర అలసటకు ఒక ప్రధాన కారణంగా మారుతుంది. ఇందులో నిద్రలో ఉండగా గొంతు భాగంలోని శ్వాస మార్గం కొంతసేపు మూసుకుపోవడం వల్ల శ్వాస ఆగిపోతూ మళ్లీ మొదలవుతూ ఉంటుంది. ప్రతి సారి ఇలా జరిగినప్పుడు మెదడు చిన్నగా మేల్కొనే సంకేతం పంపుతుంది. ఈ అంతరాయాలు వ్యక్తికి తెలియకపోయినా నిద్రను విరామాలతో నింపేస్తాయి. ఫలితంగా గాఢనిద్ర దశకు శరీరం చేరుకోలేకపోతుంది. దీంతో చాలాసేపు నిద్రపోయినా అలసట తగ్గదు. అలాగే ఇన్‌సోమ్నియా లేదా నిద్రలేమి సమస్య ఉన్నవారిలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. నిద్రపోవడానికి ఎక్కువ సమయం పట్టడం, రాత్రి మధ్యలో పలుమార్లు మేల్కొనడం లేదా చాలా త్వరగా లేచి మళ్లీ నిద్ర పట్టకపోవడం జరుగుతుంది. మొత్తం నిద్ర సమయం సాధారణంగా కనిపించినా, అది విరామాలతో ఉండటంతో శరీరానికి పూర్తి విశ్రాంతి లభించదు. దీని వల్ల పగటిపూట చిరాకు, మానసికంగా చురుకుగా లేకపోవడం, అలసట వంటివి ఎక్కువగా ఉంటాయి.



**మానసిక సమస్యలు ఉంటే..**

డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక ఆరోగ్య సమస్యలు కూడా శరీర శక్తిని తగ్గిస్తాయి. కొందరు ఎక్కువసేపు నిద్రపోయినా అలసటగా అనిపిస్తే, మరికొందరికి ఆలోచనలు, టెన్షన్ కారణంగా సరైన నిద్ర పట్టదు. ఆందోళన ఎక్కువగా ఉన్నప్పుడు మెదడు ఎప్పుడూ అప్రమత్త స్థితిలోనే ఉండటంతో శరీరం పూర్తిగా రిలాక్స్ కాలేకపోతుంది. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, ఊపిరితిత్తుల సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు కూడా శరీర శక్తిని తగ్గిస్తాయి. ఈ వ్యాధులతో శరీరం సాధారణ పనులు చేయడానికే ఎక్కువ శక్తి వినియోగించుకోవాల్సి వస్తుంది. అదనంగా నొప్పులు, శ్వాసలో ఇబ్బందులు లేదా రాత్రివేళ తరచూ బాత్రూంకి వెళ్లాల్సి రావడం వల్ల నిద్ర మధ్యలో భంగం కలుగుతుంది.

**రాత్రి పూట ఇలా చేయవద్దు..**

హైపర్‌సోమ్నియా అనే పరిస్థితిలో వ్యక్తి ఎక్కువసేపు నిద్రపోయినా పగటిపూట తీవ్రమైన నిద్రమత్తుగా అనిపిస్తుంది. నిద్రలేచిన తర్వాత కూడా మత్తుగా ఉండటం, రోజంతా బద్ధకంగా అనిపించడం ఈ సమస్య లక్షణాలు. మెదడు నిద్ర నుంచి మేల్కొనే స్థితికి సరిగా మారకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. జీవనశైలి అలవాట్లు కూడా నిద్ర నాణ్యతపై ప్రభావం చూపుతాయి. రాత్రివేళ ఎక్కువగా తినడం, మసాలా ఆహారం తీసుకోవడం, ఆల్కహాల్ సేవించడం, పడుకునే ముందు మొబైల్ లేదా ల్యాప్‌టాప్ వాడటం, అసమయాల్లో నిద్రపోవడం వంటి అలవాట్లు శరీర అంతర్గత గడియారాన్ని గందరగోళానికి గురిచేస్తాయి. అలాగే శారీరక వ్యాయామం లేకపోవడం, నీరు తక్కువగా తాగడం, పోషకాహారం లోపించడం కూడా రోజంతా అలసటగా అనిపించేలా చేస్తాయి. నిరంతరం అలసటగా అనిపిస్తే దాన్ని చిన్న సమస్యగా తీసుకోకుండా, సరైన నిద్ర అలవాట్లు పాటించడం, అవసరమైతే వైద్యులను సంప్రదించడం ద్వారా సమస్యను గుర్తించి పరిష్కరించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# రోజూ 10 నిమిషాలు ధ్యానం చేస్తే ఎన్ని ప్రయోజనాలో తెలుసా?

ఇంటర్నెట్ డెస్క్: నేటి వేగవంతమైన జీవనశైలితో చాలామంది ఒత్తిడి, ఆందోళన సమస్యలతో బాధపడుతున్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో ముఖ్యం. ఇందుకోసం ప్రతిరోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం మంచి అలవాటని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు కేవలం 10 నిమిషాలు ధ్యానం చేసినా మానసిక ప్రశాంతతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు.

**ఒత్తిడి తగ్గుతుంది**

ఉదయం ధ్యానం చేయడం వల్ల శరీరంలో ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో మనసు ప్రశాంతంగా ఉండి ఆందోళన, టెన్షన్ తగ్గుతాయి.

**ఏకాగ్రత పెరుగుతుంది**

రోజూ ధ్యానం చేసే వారికి పనిపై దృష్టి ఎక్కువగా ఉంటుంది. పరధ్యానం తగ్గి ఏకాగ్రత, ఆలోచనా శక్తి మెరుగుపడుతుంది. నిర్ణయాలు కూడా త్వరగా తీసుకోగలుగుతారు.

**మనసు ప్రశాంతంగా ఉంటుంది**

ధ్యానం మనసును స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది. చిరాకు, కోపం తగ్గి మానసికంగా ప్రశాంతంగా ఉండటానికి ఉపయోగపడుతుంది.

**శక్తి పెరుగుతుంది**

ఉదయం ధ్యానం చేయడం వల్ల శరీరంలో ఆక్సిజన్ ప్రవాహం మెరుగుపడుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా, శక్తివంతంగా ఉండగలుగుతారు.



**రోగనిరోధక శక్తి బలపడుతుంది**

ధ్యానం వల్ల శరీరం త్వరగా కోలుకునే సామర్థ్యం పెరుగుతుంది. క్రమం తప్పకుండా ధ్యానం చేసే వారికి అనారోగ్యాలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**రక్తపోటు నియంత్రణ**

ధ్యానం రక్త ప్రసరణను మెరుగుపరచి గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. దీంతో అధిక రక్తపోటు సమస్యను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**నిద్ర బాగా పడుతుంది**

నిద్రలేమి సమస్య ఉన్నవారికి ధ్యానం చాలా ఉపయోగకరం. ఇది మనసును ప్రశాంతంగా ఉంచి మంచి నిద్రకు సహాయపడుతుంది.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?



ఇటీవల కాలంలో గట్ హెల్త్ (జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం) గురించి అవగాహన పెరుగుతోంది. గట్ హెల్త్ జీర్ణక్రియకే పరిమితం కాకుండా శరీర రోగనిరోధక శక్తి, మానసిక ఆరోగ్యం వంటి అనేక అంశాలపై ప్రభావం చూపుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాలనే తీసుకుంటున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నప్పటికీ గట్ సమస్యలు తగ్గడం లేదని చాలా మంది చెబుతున్నారు. దీనికి కారణం కేవలం హెల్తీ ఫుడ్ మాత్రమే సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో గట్ మైక్రోబయోమ్ అనే సూక్ష్మజీవుల సమూహం ఉంటుంది. ఇవి జీర్ణక్రియకు సహాయం చేయడమే కాకుండా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ మైక్రోబయోమ్ సమతుల్యత దెబ్బతింటే, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా కూడా పూర్తి ప్రయోజనం కనిపించదు.

**పులియబెట్టిన ఆహారాలు అయితే..**

ఇలాంటి పరిస్థితుల్లో ఫెర్మెంటెడ్ ఫుడ్స్ లేదా పులియబెట్టిన ఆహారాలు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరానికి ఉపయోగకరమైన బ్యాక్టీరియాను అందించి గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగర్ట్, కేఫిర్, కిమ్చి, సావర్‌క్రాట్ వంటి ఆహారాల్లో మంచి బ్యాక్టీరియా అధికంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే కేవలం ఫెర్మెంటెడ్ ఫుడ్స్ మాత్రమే సరిపోవని, వాటితో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని కూడా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. గింజలు, బీన్స్, ఓట్స్, పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం మంచి బ్యాక్టీరియాకు ఇంధనంలా పనిచేస్తుంది. ఈ రెండూ కలిసి గట్ మైక్రోబయోమ్‌ను బలంగా ఉంచడంలో సహాయపడతాయి.

**జీర్ణ సమస్యలకు చెక్..**

ఇలా ఫెర్మెంటెడ్ ఫుడ్స్‌తో కూడిన ఆహారాన్ని రెండు వారాల పాటు క్రమంగా తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటం, పోషకాలు శరీరానికి బాగా అందడం, రోగనిరోధక శక్తి పెరగడం వంటి మార్పులు కనిపించే అవకాశం ఉంటుంది. అలాగే పొట్ట బరువుగా అనిపించడం, అజీర్ణం వంటి సమస్యలు కూడా తగ్గవచ్చని సూచిస్తున్నారు. అయితే ఈ ఆహారాలను ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. మొదట చిన్న మోతాదులో ప్రారంభించడం ఉత్తమం. ఉదాహరణకు రోజుకు అర కప్పు పెరుగు లేదా కొద్దిపాటి కిమ్చితో ప్రారంభించి, శరీరం అలవాటు పడిన తర్వాత నెమ్మదిగా మోతాదును పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.